క్లుప్తంగా

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో పరశురాములుకు కేక్ తినిపిస్తున్న క్లబ్ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ జిల్లా గవర్నర్ లయన్ కన్నా పరశురాములు జన్మదినం సందర్భంగా డివిజన్‌కేంద్రంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఘన్‌పూర్ క్లబ్ అధ్యక్షుడు అంబటి కిషన్‌రాజ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పరశురాములు మాట్లాడారు. అన్న ప్రసాద వితరణ చేయడం సేవా గుణానికి తార్కాణమన్నారు. క్లబ్ బాధ్యులు కేసీ జాన్ బన్నీ, హరికిషన్‌రెడ్డి, అల్లాడి ప్రభాకర్, గుండేటి సంపత్, గన్ను రమేష్, ఆమంచ మధుసూధన్, గోలి శ్రీనివాస్, విజయ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్



స్టేషన్‌ఘన్‌పూర్: నూతన సంవత్సరం సందర్భంగా ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యాశిరీష్‌రెడ్డి హనుమకొండలో గురువారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని, ఎంపీ డాక్టర్ కడియం కావ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న నాయకులు

పాలకుర్తి: కాంగ్రెస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ పులి గణేష్, గిరగాని వెంకన్న, పులిహనుమయ్య, పెదగాని వెంకన్న, పులి శ్రీకాంత్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇళ్లు ఇవ్వాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ తదితరులు

జనగామ: అర్హులందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇప్పించి తాగునీటి సౌకర్యం కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సంజయ్‌నగర్ 16వ వార్డులో ఈ నెల 6న పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట పలు సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని వారికి 120 గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ. 15 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు కళ్యాణం లింగం, మహేందర్, సౌందర్య, అంజమ్మ, రాజు, సుదాకర్, శ్రీను, తార, అనిత, అండాలు, ఉమ, రమ్య, మమత పాల్గొన్నారు.

విరాళం



చిల్పూరు: మండలంలోని లింగంపల్లి గ్రామం నుంచి శబరిమలకు ఇరుముడితో మాలధారులు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాలధారులకు మాజీ సర్పంచ్ ఏదునూరి రవీందర్ రూ. 2,500 విరాళం అందజేశారు.

గోదామాధవ కేంద్రంలో గాజుల పండుగ

హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో గురువారం ఉదయం తిరుప్పావై వ్రత పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆపదుద్దారక స్వామికి ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర శతనామార్చనలు, ప్రత్యేక పూజలు, ఆరగింపు, మంగళహారతి నిర్వహించారు. అనంతరం గాజుల పూజ జరిపించారు. అనంతరం మహిళలు రంగురంగుల గాజులు, పండ్లు పసుపు, కుంకుమ, తాంబూలాలు సమర్పించారు. కార్యక్రమంలో వెన్నపురెడ్డి సరళ, శేషప్రియ, బొల్లోజు సుధారాణి, విశాలి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బీఓబీ ఏర్పాటు

- జఫర్‌గఢ్ బ్రాంచ్ ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు
- తీరనున్న ఖాతాదారుల ఇబ్బందులు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో కొనసాగుతున్న బ్యాంక్ ఆఫ్ బరోడా జఫర్‌గఢ్ బ్రాంచ్

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మండల కేంద్రం నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు తరలించిన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) బ్రాంచ్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కల సాకారం కానుంది. మూడు దశాబ్దాల క్రితం జఫర్‌గఢ్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ తరలించారు. అప్పటి నుంచి బ్యాంకునకు సంబంధించిన లావాదేవీలను ఘన్‌పూర్ నుంచే కొనసాగిస్తుండడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు బ్యాంకు సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో బ్యాంకు ఖాతాదారులు, మహిళా పొదుపు సంఘాల సభ్యులు, రైతులు, వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా, ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన కడియం శ్రీహరి తనను గెలిపిస్తే జఫర్‌గఢ్ నుంచి తరలిన బీఓబీ బ్రాంచ్‌ను తిరిగి రప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హామీలో భాగంగా ఉన్నతాధికారులతో పలుమార్లు ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడి కొత్త శాఖను ఏర్పాటు చేసేందుకు ఒప్పించారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా ఎట్టకేలకు బ్యాంక్ ఆఫ్ బరోడాకు సంబంధించిన మరో కొత్త బ్రాంచ్ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఆర్‌బీఐ నుంచి వెలువడడంతో సంబంధిత అధికారులు జఫర్‌గఢ్‌లో బ్రాంచ్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దీంతో త్వరలో జఫర్‌గఢ్‌లో బీఓబీ సేవలు అందుబాటులోకి రానుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీటీడీ వేద పండితుడికి ఘన సన్మానం



టీటీడీ వేద పండితుడిని సన్మానిస్తున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసిన తిరుమల తిరుపతి దేవస్థాన వేద పండితులు గుంటూరు జనార్ధనాచార్యులును ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు గురువారం ఘనంగా సన్మానించారు. భక్తుల ఆహ్వానం మేరకు శివునిపల్లి లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చిన జనార్ధనాచార్యులు ముందుగా ఆలయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ధనుర్మాస విశిష్టత, గోదాదేవి ప్రాముఖ్యతను భక్తులకు బోధించారు. అనంతరం ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో వేదపండితులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వీటీ శ్రీనివాస్, వెంకటేశ్వరాచార్యులు, రంగనాథాచార్యులు, నాగబండి వెంకట్రామనర్సయ్య, కూరెళ్ళ భానుహరిప్రియ, పార్శి రంగారావు, బుచ్చిబాబు, ఏకే రావు, శ్రీరాములు, చిరంజీవులు, హరిప్రసాద్, కిషోర్‌కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.

కార్యకర్తలే కొండంత బలం



జనగామ: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొమ్మూరి, పక్కన ఏఎంసీ చైర్మన్, నాయకులు



జనగామ: 15వ వార్డులో నిర్వహించిన వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు, నాయకులు

- జన్మదిన వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ/బచ్చన్నపేట/తరిగొప్పుల/నర్మెట: నియోజకవర్గంలో పార్టీకి కార్యకర్తలే కొండంత అండగా నిలుస్తూ కష్టపడుతున్నారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కొమ్మూరి జన్మదిన వేకలను పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని సిద్దిపేటరోడ్డు ఓంసాయి గార్డెన్‌లో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అధ్యక్షతన వారాహి హాస్పిటల్ సహకారంతో మెగా హెల్త్ క్యాంపుతో పాటు రక్తదాన శిబిరం, మహా అన్నదానం నిర్వహించగా కొమ్మూరి ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్‌తో పాటు పార్టీ శ్రేణులు, మహిళా విభాగం నేతలు కొమ్మూరికి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. చంపక్ హిల్స్ ఎంసీహెచ్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ ఆవరణలో చెంచారపు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. 30 వార్డులో కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 15వ వార్డులో మల్లోజు గిరిబాబు, సిద్ధంశివ నేతృ త్వంలో దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేపట్టారు. 19 వ వార్డులో కేక్ కట్ చేసి నూతన వస్త్ర దుకాణాన్ని కొమ్మూరి ప్రారంభించారు. అనంతరం కొమ్మూరి మాట్లాడుతూ జనగామ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అలాగే పలు మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా కొమ్మూరి జన్మదినాన్ని నిర్వహించారు. బచ్చన్నపేట నిర్వహించిన వేడుకల్లో ప్రతాప్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. ప్రతాప్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ క్రైస్తవ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు బక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

'ఎరుకల' అభివృద్ధికి పాటుపడాలి

- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు



మాట్లాడుతున్న దేవరాయ సాయిలు

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం ఎరుకల కులస్తుల అభివృద్ధికి పాటు పడాలని ఎరుకల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరుకల అభివృద్ధికి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్లలో మొదటి ప్రాధాన్యం కల్పించాలన్నారు. పందుల పెంపకానికి కుటుంబానికి 20 గుంటల భూమిని కేటాయించి బ్యాంకుతో సంబంధం లేకుండా రూ.10 లక్షల రుణాన్ని నేరుగా అందించాలని కోరారు. కూరాకుల రవి, నర్సింహులు, సుభాష్, యాదగిరి, ప్రభాకర్, మంగయ్య, చెంద్రయ్య, తమ్మయ్య, ఉప్పలయ్య, రాజు పాల్గొన్నారు.

'ఆత్మీయ' సేవలు అభినందనీయం



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఎస్సై, తదితరులు

- ఎస్సై పవన్‌కుమార్

పాలకుర్తి: ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ అందజేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్సై పవన్ కుమార్ అన్నారు. గురువారం పాలకుర్తి మండలం ఈరవెన్ను జెడ్పీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఎస్సై చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ ప్రమీల, సభ్యులు సోమేశ్వర్, ముసుకు కేశవరావు, ఏదునూరి మదార్, మల్లేష్, బిర్రు వెంకటేశ్వర్లు, పురుషోత్తం, జక్కుల రాజు, యార రాజు, మహేందర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ముషీర్‌ఖాన్, గోపాల్, వంశీకృష్ణ, భాగ్యలక్ష్మి, కేదారేశ్వరి, లీలావతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అంచనా



అభివృద్ధి పనులకు అంచనా వేస్తున్న పీఆర్ అధికారులు

చిల్పూరు: మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఇటీవల కాంగ్రెస్ నాయకుడు జక్కుల రాజయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే ఆదేశాలతో పీఆర్, ట్రాన్స్‌కో అధికారులు పనులకు అంచనా వేశారు. అభివృద్ధి పనులకు మంజూరు ఇప్పించిన ఎమ్మెల్యేకు రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు. పుట్ట కిరణ్‌రెడ్డి, సాదం రాజయ్య, ఇసాక్, సాదం నర్సింహులు, ఎర్రబెల్లి చేరాలు, మహేష్, భీమన్న, దయాకర్, పోలు రఘు తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం

దేవరుప్పుల: నూతన సంవత్సరం పురస్కరించుకుని ముందస్తు, తదుపరి రోజు వేడుకల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు యంత్రాగం తోడ్పాటు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఉప్పల సురేష్‌బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పోలీసు శాఖకు పటిష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో క్షేత్ర స్థాయిలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టడంతో మద్యం సేవించి వాహనదారులు రహదారులు ఎక్కకుండా కృషి చేయడం పట్ల ఆయన పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తున్న పెన్షనర్లు

జనగామ రూరల్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను డీటీఓ పి.నరసింహారెడ్డి, ఏటీఓ కమల, ఎస్‌టీఓ శ్రీనివాస్, కొడకండ్ల ఎస్‌టీఓ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శరాబ్ వీరన్న, సంఘం జిల్లా అధ్యక్షుడు ఎరోజు రామస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, మహిళ ఉపాధ్యక్షురాలు గాదో క్యాథరిన్, రామచంద్రం, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీఆర్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో..

స్టేషన్‌ఘన్‌పూర్: సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్‌యూనియన్ వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ కాజీపేట బ్రాంచి కార్యదర్శి ఇల్లందుల రాజేందర్ మాట్లాడారు. నూతన సంవత్సరంలోనైనా కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణిని వీడాలని, రైల్వేకార్మికులకు నూతన పెన్షన్‌లో యూపీఎస్‌ని పూర్తిగా పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి మజ్దూర్‌యూనియన్ అంకితభావంతో పనిచేస్తుందని, కార్మికులు ఐక్య పోరాటాలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, బాలరాజు, శ్రీనివాస్, శ్రీను, కుమార్, రమేష్, యాదగిరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి బాండ్‌ను అందజేస్తున్న ఎంఈఓ, టీచర్లు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆఫీస్ సబార్డినేట్ కన్నెబోయిన రమేశ్ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబానికి ఉపాధ్యాయులు రూ.60 వేల సాయం చేశారు. గురువారం ఎంఈఓ పోతుగంటి నర్సయ్య బాధిత కుటుంబ సభ్యుల పేరుతో పోస్టాఫీస్‌లో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందజేశారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శోభరాణి, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం చిదురాల శ్రీనివాస్, టీఎస్‌యూటీఎఫ్, పీఆర్టీయూ, డీటీఎఫ్, టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పడిపోయిన ఏసీ యూనిట్ అప్పగింత



బాధితుడికి ఏసీ యూనిట్‌ను అందిస్తున్న సీఐ

స్టేషన్‌ఘన్‌పూర్: ఫ్లిప్‌కార్ట్ వారు డెలివరీ కోసం దాదాపు రూ.40వేల విలువైన ఏసీ యూనిట్‌ను హనుమకొండ నుంచి హైదరాబాద్ వైపునకు ట్రాలీలో తరలిస్తుండగా ఘన్‌పూర్ శివారులో ఎక్కడో జారిపడిపోయింది. కాసేపటికి విషయాన్ని గమనించిన బాధితుడు వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసులు ఘన్‌పూర్ శివారులో జాతీయ రహదారి వెంట పరిశీలించి కోల్పోయిన ఏసీ యూనిట్‌ను గుర్తించారు. అనంతరం బాధితుడికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సదరు ఏసీ యూనిట్‌ను సీఐ జి.వేణు ఆధ్వర్యంలో అందించారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి

- జిల్లా అధ్యక్షుడు కరుణాకర్



నియామక పత్రం అందుకుంటున్న కరుణాకర్

చిల్పూరు: జిల్లాలో మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) బలోపేతానికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు ఎడ్ల కరుణాకర్ అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందున త్వరలో మండల కమిటీలను ప్రకటిస్తానన్నారు. విల్సన్, ఎడ్ల సమ్మయ్య, మండల అధ్యోఉడు మునుపెల్లి ఆనందం, కొంరయ్య, శ్రీను, చిరంజీవి పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఫలితాలు సాధించాలి



లింగాలఘణపురం: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, పీఆర్‌టీయూ నాయకులు



జఫర్‌గఢ్‌లో..

లింగాలఘణపురం: రాబోయే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ విష్ణుమూర్తి కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పీటీఆర్‌టీటీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులంతా పదో తరగతి ఫలితాలపై దృష్టి పెట్టి మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లికార్జున్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీకోజీ, మాజీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులు, సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు హరిప్రసాద్, మండల అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: టీఎస్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, ఉపాధ్యాయులు.. ఎంఈఓ రఘునందన్‌రెడ్డి చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రామారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సదానందం, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మండల కమిటీ ఎంపిక



బాలచందర్



రామకృష్ణ

నర్మెట: డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా మండలకేంద్రానికి చెందిన కన్నెబోయిన రామకృష్ణ, మచ్చుపహాడ్‌కు చెందిన గొల్లపల్లి బాలచందర్, కిసాన్ సెల్ మండల కార్యదర్శిగా గొల్లపల్లి అంజయ్య గౌడ్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డికి, మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణకు, గొల్లపల్లి కుమారస్వామికి, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఫరీదుల యాదయ్యకు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెవుల పరశురాములుకు, మహిళా అధ్యక్షురాలు దేవులపల్లి భాగ్యలక్ష్మికి , సీనియర్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు షటిల్ బ్యాట్ల పంపిణీ




షటిల్ బ్యాట్లను పంపిణీ చేస్తున్న రవీందర్

కొడకండ్ల: మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దామెర రవీందర్– సునీత దంపతులు గురువారం షటిల్ బ్యాట్లను పంపిణీ చేశారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడలపై ప్రోత్సాహం అందించాలనే సంకల్పంతో తమవంతు చేయూతనిచ్చినట్లు దాతలు తెలిపారు. ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి గాజుల రాములు, అందె యాకయ్య, కొమురయ్య ఉన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లో ఈనెల 3వ తేదీన నిర్వహించే మహోత్సవ సభకు భవన నిర్మాణ రంగాల కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రం చేయాలని సంఘం రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు కోరారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఎస్‌ఆర్‌కేఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల ఐలన్న పిలుపు మేరకు 3న సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు..

విద్య, సంస్కారంతోనే మంచి వ్యక్తిత్వం



మాట్లాడుతున్న దామోదర్

విద్యారణ్యపురి: విద్య, సంస్కారంతోనే మంచి వ్యక్తిత్వం పెంపొందుతుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో గురువారం జరిగిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సంస్కారాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్‌పీ దామెర నర్సయ్య మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే కష్టపడి చదువుకోవాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం ఉమాదేవి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, బాధ్యులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, బీఈడీ ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

ముట్టుకుంటే షాక్



కరెంట్ స్తంభానికి అడ్డుగా పెట్టిన కర్రలు

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలో మసీదు వద్ద ఉన్న ఇనుప కరెంట్ స్తంభం ముట్టుకుంటే షాక్ కొడుతోంది. దీంతో గురువారం గ్రామస్తులు విద్యుత్ స్తంభం చుట్టూ కర్రలను అడ్డుగా పెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలోని మసీదు వద్ద కూర్చొని పలు విషయాలు చర్చించుకుంటామని తెలిపారు. స్తంభాన్ని తొలగించాలని ట్రాన్స్‌కో అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వర్షం కురిసినా, మంచు పడినా స్తంభం షాక్ కొడుతోందన్నారు. ఇప్పటికే చాలామందికి విద్యుత్ షాక్ కొట్టిందని, అందుకే స్తంభం వైపు ఎవరూ వెళ్లకుండా కర్రలను అడ్డుగా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ప్రమాదకర స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.